సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
మంగళవారం,2 ఏప్రిల్ 2024



## ఎమ్మెల్యే డిఎన్ఆర్ సమక్షంలో జన సైనికులు వైసీపీలో చేరిక





**కైకలూరు మేజర్‌న్యూస్ :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు ఆకర్షితులై, వారు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు పేర్కొన్నారు. కైకలూరు ఏలూరు రోడ్ లోని పార్టీ కార్యాలయం నందు కైకలూరు యొక్క అభివృద్ధి శాసన సభ్యులు దూలం నాగేశ్వరావు తో వైసీపీ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని గ్రహించిన, ముదినేపల్లి మండలం నుంచి మండల జనసేన ప్రధాన నాయకులు మరియు టీడీపీ నాయకులు ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు సమక్షంలో వైస్సార్సీపీ లోకి చేరారు. అనంతరం వైసీపీ కుటుంబంలోకి స్వాగతం పలికి మీరందరి కలయికతో మీ మండలం తోపాటు ఈ నియోజకవర్గం కూడా మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపి, ముదినేపల్లి మండల జనసేన గౌరవ అధ్యక్షులు పోకల దేవేంద్ర గోపాల కృష్ణ, ముదినేపల్లి మండల జనసేన కార్యదర్శి నాగదేశి గణేష్ బాబు, ముదినేపల్లి మండల జనసేన నాయకులు నర్రా ప్రభు, కారుమంచి యుగంధర్, ముదినేపల్లి మండల టీడీపీ నాయకులు అల్లాడి సతీష్ బాబు లకు పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతం తెలియచేశారు. అనంతరం జనసేన,టీడీపీ పార్టీలను వీడి వైసీపీలోకి చేరిన నాయకులు వచ్చే సార్వత్రిక ఎన్నికలో శాసన సభ్యులుగా మిమ్మల్ని, ఏలూరు పార్లమెంట్ సభ్యులుగా కారుమూరి సునీల్ కుమార్‌యాదవును గెలుపించుకొని ముఖ్యమంత్రి జగన్‌కి అందిస్తామని ఎమ్మెల్యే డిఎన్ఆర్‌కి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు సాక్షి సాయిబాబు, టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ జారీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



### -హోం ఓటింగ్‌కు సంబంధించి సమాచారం సేకరించాలి

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియకు సంబంధించి రానున్న 2 రోజులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సుమారు 25 వేల పోస్టల్ బ్యాలెట్స్ అవసరం కాగలవని తెలిపారు. ఇందుకు సంబంధించి నియోజకవర్గాల వారీగా నివేదికను రూపొందించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సుమారు 11 వేల సిబ్బంది,సుమారు 5 వేల మంది అత్యవసర సేవలకు సంబంధించిన సిబ్బంది, 1800 మంది పోలీసులతోపాటు మిగిలిన 85 సంవత్సరాల వయస్సు నిండిన,వివిధ ప్రతిభా వంతులు తదితరులు ఉన్నారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అనంతరం 85 సంవత్సరాలు వయస్సుదాటిన ఓటర్లు,దివ్యాంగుల వద్దనుండి హోం ఓటింగుకు అభ్యర్ధన పత్రాలు తీసుకొని ఎంతమంది హోం ఓటింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవాలనుకుంటున్నారోవారిజాబితాను రూపొందించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఏ పిఓ ఎం.సూర్యతేజ, నూజివీడు ఆర్డిఓ వై.భవానిశంకరి , ఏలూరు ఆర్డిఓ ఎన్.ఎస్.కె.ఖాజావలి, జంగారెడ్డిగూడెం ఆర్డిఓ కె.అద్దయ్య,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెల్లవారకుండానే పెన్షన్ ఇచ్చే వారిని తొలగించే కుట్ర చేసిన టిడిపి

### ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



**పెంటపాడు,మేజర్‌న్యూస్:** పెంటపాడు మండలం దర్శిపరు గ్రామంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంలో ప్రభుత్వం ఇచ్చే పెన్షన్లు ఇవ్వడంలో వాలంటీర్లను తప్పించడంపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ స్పందిస్తూ, ఒకటవ తేదీ వచ్చిందంటే మా వాలంటీర్ తెల్లవారుజామున వచ్చి పెన్షన్ ఇస్తారని వేచి చూసే వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు నిరాశ ఎదురైంది. రాష్ట్రంలో ఉన్న 69లక్షల మంది పెన్షన్ దారుల దగ్గర నోటిదగ్గర కూడు లాగేసుకున్నట్లు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, రామోజీరావు అందరు కలసి కుట్రపన్నారు. టీడీపీ హయాంలో పెన్షన్లు కోసం వృద్ధులను ఏ విధంగా ఇబ్బందులకు గురిచేసారో ఆ విధంగా మళ్ళీ చేయాలని నీచ రాజకీయాలు చేస్తున్నారు. పనికిమాలిన వెధవ నిమ్మగడ్డ రమేష్ ద్వారా పెన్షన్లు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు.

ఆనాడు చంద్రబాబు తొత్తులాగా పనిచేసి కరోనా లేనప్పుడు ఉందని, ఉన్నప్పుడు లేదని ఎన్నికల విషయంలో ఆటంకాలు చేసాడు. వాళ్ళు చేస్తున్న ద్రోహాలు ప్రజలు గమనిస్తున్నారు. వీటికి పర్యవసానం మే 13న తీర్పు ఇవ్వనున్నారు. 2019లో ఇచ్చిన తీర్పు మళ్ళీ 2024 ఎన్నికల్లో చంద్రబాబుకి చెంపదెబ్బ ఖాయం అన్నారు. వీళ్ళందరికి బుద్ధిచెప్పే రోజుదగ్గరలోఉందని కొట్టు సత్యనారాయణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అప్సర వైస్ చైర్మన్ వద్దె రఘురాం నాయుడు, చెన్న జనార్ధన్ రావు, ముప్పిడి సంపత్ కుమార్, సాంబయ్య పలువురు వైఎస్సార్సీపీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమం కోసమే కూటమి బరిలోకి ... బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రజల బాగుకోసమే జనసేన కూటమితో కలిసి ప్రజల్లోకి వస్తుందని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో వైఎస్ఆర్ సీపీ ప్రధాన నేత ఉంగరాల శ్రీనివాసరావు బొలిశెట్టి శ్రీనివాస్, తోటగోపిసమక్షంలోజనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఒకటి రెండు వార్డులలో పలువురు ఎస్టీ సెల్ నాయకులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అందరికీ జనసేన పార్టీ కండువా కప్పి బొలిశెట్టి శ్రీనివాస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన అంతిమ దశకు చేరుకుందని ప్రజలు సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల నియమావళిలో వాలంటీర్లు పనిచేయడానికి లేదని ఎన్నికల కమిషన్ తీర్పు ఇస్తే అది ప్రతిపక్షాలు చేసిన కుట్రని చెప్పి ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేయడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, అడబాల నారాయణమూర్తి, పై బోయిన రఘు, పలువురు జనసేన నాయకులు కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు.

## పెన్షన్లపై వైసిపి నేతల దుష్ప్రచారం



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** వృద్ధాప్య, వితంతు,వికలాంగుల ఒంటరి మహిళల ,పింఛన్లఆలస్యంపై వైసిపినేతలు తెలుగుదేశం, చంద్రబాబుపై అసత్య ప్రచారం చేస్తున్నారని తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వలవల బాబ్జి అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెంలోని తెలుగుదేశం కార్యాలయంలో వలవల బాబ్జి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వైసిపి నేతలు చెప్పేవన్నీ అబద్ధాలని, వాలంటీర్లను ప్రభుత్వం అడ్డగోలుగాతమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడంతోఎన్నికల సంఘం వాలంటీర్లను పక్కన పెట్టగా, మానాయకుడు చంద్రబాబు పెన్షనర్లకు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రజలకు పెన్షన్లు అందించాలని సూచించారని, కానీ వైసిపి నేతలు చంద్రబాబుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రూ.200 లు ఉండే ఫించన్ నేరుగా రూ.2000 లు చేసింది తెదేపా, చంద్రబాబు అని, రానున్న ఎన్నికలలో మా పార్టీ అధికారంలోకి రాగానే రూ.3000 లు నుండి రూ.4000 లుకు పెంచుతామని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన బీసీ మహిళలకు కూడా రూ.4000 లు ఇస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పసల కొండ,రాంబాబు, శ్రీను,ముప్పిడి రమేష్,సతీష్ పాల్గొన్నారు.

## స్వామి కళ్యాణానికి అక్షింతలు సిద్ధం



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** పంచారామ క్షేత్రాలలో ఒకటైన శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు ఏప్రిల్ 19వ తేదీన జరుగునున్న స్వామి వారి కళ్యాణానికి సనాతన దాండి గ్రూపు టీచర్ నంబూరి భాగ్యలక్ష్మి సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని 50 కేజీల వరి ధాన్యాన్ని చేతితో వలుస్తూ స్వామివారికి అక్షింతలకు వాడేందుకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సుచిగ తయారయ్యి ఈ కార్యాన్ని చేస్తున్నారు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, సభ్యులు, కార్యనిర్వాహణాధికారి ఏళ్ళ సూర్యనారాయణ తదితర్య పర్యవేక్షణలో జరుగుతుంది,

## రాజకీయ పార్టీల ప్రచార వ్యయాన్ని పక్కాగా లెక్కించాలి

### -జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం



**భీమవరం,మేజర్‌న్యూస్ :** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి ప్రవీణ్ ఆదిత్యతో కలిసి జిల్లా స్థాయి ఎలక్షన్ ఎక్స్పెండిచర్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఎలక్ట్రానిక్, ప్రింట్, కేబుల్ నెట్వర్కు, సోషల్ మీడియా, బహిరంగ సభలు,ర్యాలీలు ద్వారా ప్రచారాలు, స్టార్ క్యాంపెనర్, హెలికాప్టర్ ఖర్చులు,పాంప్లెట్లు, పోస్టర్లు ప్రింటింగ్, వాహనాలు, వీడియో తదితర ఖర్చుల లెక్కింపు పై విపులంగా సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు, చెల్లింపు వార్తలను (పెయిడ్‌న్యూస్), స్టార్ క్యాంపైనర్ల ప్రచారం, ఇతర ఉల్లంఘనలు కూడా గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్టర్ కాబడిన జాతీయ,రాష్ట్ర రాజకీయ పార్టీలు గానీ వారి తరఫున ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు ఎలక్ట్రానిక్ రాజకీయ ప్రచార ప్రకటనలను ప్రసారం చేసెందుకు అనుమతి కోసం నిర్ణీత నమూనాలో 3 రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వార్తాపత్రికల్లో పోలింగ్ రోజు,పోలింగ్‌కు ముందు రోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుండి అనుమతి పొందిన తరువాతనే ప్రకటన ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు,ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు,యం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, ఆర్వోలు బి.శివనారాయణ రెడ్డి, వి.స్వామి నాయుడు,పలువురు అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కూటమి సభ్యులు

### అప్సడా వైస్ చైర్మన్ వడ్డీ రఘురాం నాయుడు



**తాడేపల్లిగూడెం, మేజర్‌న్యూస్:** టీడీపీ జనసేన బీజేపీ పార్టీలు గుంపులు గుంపులుగా కలిసి ఆంధ్ర రాష్ట్ర ప్రజలను ఇబ్బందులు పెట్టేందుకు కృషిచేస్తున్నాయని ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ ఆథారిటీ వైస్ చైర్మన్ వడ్డీ రఘురామ్ నాయుడు మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ వాలంటీర్లను పెన్షన్లు ఇవ్వకుండా తప్పించడంపై మండిపడ్డారు. మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ చంద్రబాబు జేబులోని వ్యక్తి అని రాష్ట్ర ప్రజలందరికి తెలుసన్నారు. నిమ్మగడ్డ రమేష్ ఎలక్షన్ కమిషనర్ గా పనిచేస్తున్నప్పుడు మన రాష్ట్రంలో జెడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికలవిషయంలోఇబ్బందులుగురిచేసిందిప్రజలు మరచిపోలేదన్నారు. వృద్ధులను,వికలాంగులను ఇబ్బందులు పెట్టె విధంగా చేయడం వల్ల వారిఅందరి ఉసురుఈకూటమికి తగులుతుంది, భూస్థాపితం అయిపోతుందన్నారు. 1వ తేదీ కోసం పెన్షన్ దారులు ఎంతగానో ఎదురు చూస్తుంటారని, తెల్లవారుజామునే ఇంటికెళ్లి వాలంటీర్లు పెన్షన్ ఇస్తుంటే వారి ఆనందానికి అవధులు ఉండని పరిస్థితి అన్నారు. నీచ రాజకీయాలు చేసి వాలంటీర్లను ఆపగలిగారు కాని ముందు చూపుతో సీఎం జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను ఆపలేరన్నారు. వృద్ధులు ఆసుపత్రులలో దూరప్రాంతాల్లో ఉన్నా కూడా వాలంటీర్లు పెన్షన్లు అందించారని గుర్తుచేశారు. ప్రజలని ఇబ్బందులకు గురిచేయాలనే ఈ చంద్రబాబు ఆలోచన చాలా అమానుషమని ఎద్దేవా చేశారు. వీరు ఇప్పుడే ఇలా ఉంటే అధికారంలోకి వస్తే ప్రజలకు కష్టాలు తప్పవని ఈ రాష్ట్ర ప్రజలు అనుకుంటున్నారని అప్సడా వైస్ చైర్మన్ వడ్డీ రఘురామ్ వెల్లడించారు.

## మామపై యాసిడ్ దాడి : చికిత్స పొందుతూ మృతి

### -అల్లుడి దాష్టీకం - లక్కవరంలో దారుణం



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:**జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో ప్రగడ నాగేశ్వరావు అనే వ్యక్తిపై యాసిడ్ దాడి జరిగింది.అతడు ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దాడి చేసిన వ్యక్తి సొంత అల్లుడుగా అనుమానం. మృతుడు నాగేశ్వరావు పెద్ద కుమార్తెను టీ.నర్సాపురం మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రమేష్‌కి ఇచ్చి వివాహం చేశారు. వివాహం అయిన దగ్గర నుండి తన కూతుర్ని చిత్రహింసలకు గురి చేస్తున్న అల్లుడుని పలుమార్లు మందలించిన మృతుడు నాగేశ్వరావు. ఇదంతా మనసులో పెట్టుకున్న అల్లుడు రమేష్ మామ పై ఆదివారం అర్ధ రాత్రి. బ్యాటరీలోని డిజిటల్ వాటర్,యాసిడ్‌తో దాడి చేశాడు.అర్ధరాత్రి ఒంటి గంటన్నర సమయంలో నాగేశ్వరరావు ఆరు బయట నిద్రిస్తున్న సమయంలో ముఖం,ఒంటిపై వాటర్ మిక్స్ యాసిడ్ పోసిన అల్లుడు. ఒక్కసారిగా కేకలు వేయడంతో దీనిని గమనించిన స్థానికులు108 అంబులెన్స్ కి సమాచారమిచ్చి జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రునికి మెరుగైన వైద్య సేవల కోసం ఏలూరు తీసుకెళ్లిన బంధువులు నాగేశ్వరావు ఏలూరులో వైద్యం పొందుతూ మృతి చెందాడు.ఈ ఘటనపై విచారణ చేపట్టిన జంగారెడ్డిగూడెం డి.ఎస్.పి.సీఐ రాజేష్,లక్కవరం ఎస్సై సుధీర్. కాగా నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

### పెన్షన్ల పంపిణీపై వైసీపీ దుష్ప్రచారం



**ఏలూరు, మేజర్‌న్యూస్:** ఏలూరు పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి పుట్ట మహేష్ యాదవ్ ను పరిచయం చేస్తూ టీడీపీ పార్లమెంట్ ఇన్చార్జ్ గన్ని వీరాంజనేయులు స్థానిక అతిథి హోటల్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం లో గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రం ఎంత వెనకబాటు కు గురైందో మాకంటే మీడియా వారికే తెలుసు అన్నారు.ఏలూరు పార్లమెంట్ పరిధిలో పోలవరం, కొల్లేరు, అక్వా లాంటి సమస్యలు అగమ్య గోచరంగా మారాయి అన్నారు.. ఇవన్నీ కూడా ప్రగతి పథం లో ముందుకు సాగాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమికి విజయం చేకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఏలూరు ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ విజయానికి తగిన సహకారం ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న కారణంగా పెన్షన్లు ఇంటికి వచ్చి ఇవ్వడం కుదరకపోవచ్చని అధికారులు చెపుతుంటే, దానిని కూడా టీడీపీ పై, చంద్రబాబుపై రుద్దడానికి వైసీపీ కుట్ర చేస్తుందని ఆరోపించారు. ప్రజలు ఈ విషయాన్నీ గమనించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఏలూరు ఉమ్మడి కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ మాట్లాడుతూ టిడిపి ు జనసేను బిజెపి కూటమి అభ్యర్థిగా ఏలూరు పార్లమెంటరీ స్థానానికి పోటీ చేస్తున్నానని, ఇక్కడే ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తా నని అన్నారు. నాకు తగిన సహకారం,సూచనలు, సలహా లు ఇవ్వాలని పాత్రికేయులను కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఉప్పాల జగదీష్ బాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో కూటమి అభ్యర్థి కామినేని



**కైకలూరు, మేజర్‌న్యూస్ :** విశ్వ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎన్డీఏ కూటమి అసెంబ్లీ అభ్యర్థి మాజీ మంత్రి డా. కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ... సమాజంలో విశ్వ బ్రాహ్మణుల పాత్ర చాలా వుందని ,మన పిల్లల భవిష్యత్తు మన చేతుల్లో వుందని...రాష్ట్రం గత ఐదేళ్లలో ఎటువంటి అభివృధి చెందలేదని, ప్రభుత్వ భూములు తాకట్టు పేట్టి అప్పులు తెచ్చి సంక్షేమ పథకాలు ఇవ్వడం వల్ల రాష్ట్రం అభివృధి చెందలేదని ఈ ప్రభావం రేపటి తరం మన పిల్లల భవిష్యత్తు మీద పడుతుంది అని, తెలిపారు. ఉద్యోగాలు లేక పక్క రాష్ట్రాలకు వలస పోతున్నారు, ప్రజలకు మంచి జరగాలి అంటే మంచి నాయకత్వం కావాలి, కులాలకు మతాలకు అతీతంగా పరిపాలన సౌలభ్యం కోసం మీ ముందుకు వస్తున్న....విశ్వ బ్రాహ్మణకు ఈ ప్రభుత్వంలో ఎటువంటి సంక్షేమ పథకాలు రాలేదని, విశ్వ బ్రాహ్మణుల సంక్షేమం ఎన్డీఏ కూటమితోనే సాధ్యం అన్నారు . అధికారంలో ఉన్నవారు నిన్నటి వరకు బెదిరించారు కేసులు పెట్టారు ఇవాల్టి నుండి ఎవరు భయపడవలసిన అవసరం లేదన్నారు . నేను ఇక్కడే ఉంటాను కైకలూరు నియోజకవర్గ ప్రజలు మీరు రావాలి అని కోరుకుంటే వచ్చేనని అన్నారు.ఈ కార్యక్రమంలో తుపాకులు సోమాచారి , విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు బసవయ్య,బలే ఏసు రాజు , పైడిపాటి శివ శంకర్ ,పూల రాజి, బ్రహ్మేంద్రస్వామి గుడి చైర్మన్ రామకృష్ణ ,వీరబత్తిన సుధ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థినిగా కావూరి లావణ్య



**ఏలూరు,మేజర్‌న్యూస్:** కాంగ్రెస్ పార్టీ ఏలూరు ఎంపీ అభ్యర్థినిగా కావూరి లావణ్య పేరు దాదాపుగా ఖరారు అయింది. ఏఐసీసీ ఢిల్లీలో మంగళవారం అధికారికంగా రాష్ట్రంలో పోటీ చేసే పార్లమెంట్ అభ్యర్థుల స్థానాలను ప్రకటించే అవకాశం ఉంది. సోమవారం స్థానిక చొదిమెళ్ళలోని ఏలూరు పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కావూరి లావణ్య పాత్రికేయులతో ఇష్టా గోష్టి గా మాట్లాడారు. ఏలూరు పార్లమెంటు స్థానం నుండి పోటీ చేసి అటు వైయస్సార్సిపి, ఎన్డీఏ కూటమి అభ్యర్థికి తీవ్రమైన పోటీ ఇస్తానని, ఇంకా పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి సీటు కైవసం చేసుకుంటామని పేర్కొన్నారు. ఇతర పార్టీల నాయకులు చెప్పే మాటలు నమ్మవద్దని ప్రజలకు లావణ్య విజ్ఞప్తి చేశారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్



**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:**మండలం కేంద్రమైన అగిరిపల్లి మక్కా మసీదులో సోమవారం నూజివీడు శాసనసభ్యులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఇఫ్తార్ విందు, ప్రత్యేకంగా ప్రార్థనలులో పాల్గొన్నారు.షాదిఖానాలో ఉపవాసదీషాపారులు ముస్లిం సోదరీ, సోదరులకు ఏర్పాటు చేసినఇఫ్తార్‌విందు(భోజనాలు) కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో ముస్లిం మత పెద్దలు,ముస్లిం యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పరువు వెంకన్న శత జయంతి



**పెనుమంట్ర, మేజర్‌న్యూస్** :పొలమూరు అంబేద్కర్ నగర్‌లో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ (ఆర్&బి) పరువు వెంకన్న శత జయంతి కార్యక్రమం జరిగింది, సమత ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు టి. సంపత్ రావు మాట్లాడుతూ కడు పేదరికం లో జన్మించినా పట్టుదల తో చదివి ఉన్నత స్థాయికి చేరి అంబేద్కర్ భావజాలం తో అనేకమంది కి భృతి కల్పించిన మహనీయుడు వెంకన్న ని ఆదర్శముగ తీసుకోవాలని కొనియాడారు, ముందుగా వెంకన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, విగ్రహం నిర్మాత రిటైర్డ్ వర్క్ ఇన్స్పెక్టర్ గొల్ల రామకృష్ణ ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు, సామాజిక వేత్త సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కారే వివేక్‌ను సన్మానించారు ,ఈ కార్యక్రమంలో బింకం సూర్యప్రకాశరావు, తాడిపత్రి సుదర్శన్, దిద్దే బుజ్జి, పతుల మోహనరావు, టి. వెంకట రావు, బన్ను తదితరులు పాల్గొన్నారు.

# జెఎన్వీ, గురుకుల విద్యాలయాలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

**పెదవేగి,మేజర్‌న్యూస్** : జవహర్ నవోదయ విద్యాలయం(జేఎన్వీ), ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పెదవేగి ఎంఈవో సీహెచ్.బుధవాస్ తెలిపారు. మండలంలోని తాళ్ళగోకవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న దాసరి ఆకాష్కుమార్ గురుకుల విద్యాలయానికి ఎంపిక కాగా, కొప్పులవారిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న పరసా ఈశ్వర్ సాయి జేఎన్వీలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారని ఆయన చెప్పారు. జేఎన్వీ, గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

# 14నాటికి18ఏళ్లు నిండినవారు ఓటర్లుగా అర్హులు



**భీమవరం,మేజర్‌న్యూస్ :** ఓటుహక్కు పొందేందుకు ఏప్రిల్ 1,2024 నాటికి 18 ఏళ్లు నిండినవారంతా అర్హులేనని, ఈ నెల 14వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండినవారంతా అర్హులేనని, ప్రస్తుతానికి ఇదే చివరి అవకాశం అని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో 18 సంవత్సరాలు దాటిన భారత పౌరులందరికీ ఓటుహక్కు మన రాజ్యాంగం కల్పిస్తోందని కొత్త ఓటు కోసం, లేదా చిరునామా మార్పు కోసం ఈ నెల 14వ తేదీలోపల వచ్చే ధరఖాస్తులను మాత్రమే పరిశీలించడం జరుగుతుంది. వాటిని పదిరోజుల్లోగా పరిశీలించి, అర్హత ఉంటే ఓటర్ల జాబితాలో చేర్చడం జరుగుతుందన్నారు. వీరికి మే 13న జరిగే ఎన్నికల్లో ఓటువేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఏప్రిల్ 14 తరువాత వచ్చే దరఖాస్తులను మాత్రం ఎన్నికల తరువాత మాత్రమే పరిశీలించడం జరుగుతుందన్నారు. 18ఏళ్లు నిండినవారు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్,హెచ్ టిటిపిఎస విఓటిఇఆర్ఎస్. ఇసిఐ.జిఓవి.ఐఎన్, వెబ్‌సైట్ ,హెచ్‌టిటిపిఎస్ సిఇఓఎఎన్‌డిహెచ్‌ఆర్ఎ .ఎన్ఐసి.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఫారమ్ 6లో దరఖాస్తు చేయాలని సూచించారు. చిరునామా, ఓటు మార్పు కోసం ఫారమ్ 8 ద్వారా ధరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ఫోన్ నంబర్లు 08816-299616,08816-299617 లను సంప్రదించి తమ ఓటు వివరాలను తెలుసుకొనే అవకాశాన్ని జిల్లా యంత్రాంగం కల్పించిందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# త్రాగునీటి సమస్య లేకుండా పటిష్ట ప్రణాళిక

## -వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ వెల్లడి



**ఏలూరు,మేజర్‌న్యూస్** : ఏలూరు జిల్లాలో ప్రస్తుత వేసవిలో త్రాగునీటి ఎటువంటి సమస్య తలెత్త కుండా పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకుని అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి కి తెలిపారు.రాష్ట్ర సెక్రటేరియట్ నుండి సోమవారం వేసవిలో త్రాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యుత్ సరఫరా,తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర సిఎస్. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. ఎస్. జవహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా త్రాగునీటికి ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సామాజిక పెన్షన్ పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తుందని, వాటిలో తమ జిల్లాలలో అనుకూలమైన విధానాన్ని పాటించాలన్నారు. జిల్లాలో చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలియజేస్తూ ప్రస్తుత వేసవిలో జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తెలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మంచినీటి చెరువులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపుతున్నామన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో త్రాగునీటి చలివేంద్రాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి సూర్యతేజ, జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, డిపిఓ తూతిక విశ్వనాధ్ శ్రీనివాస్ , జిల్లా పరిషత్ సీఈఓ కె. సుబ్బారావు,డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్. విజయరాజు, డ్వామా పీడీ రాము, అరడబ్ల్యూఎస్ ఎస్ ఈ సత్యనారాయణ, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఎస్. వెంకటకృష్ణ, ప్రభృతులు పాల్గొన్నారు.

## కోమటితిప్ప నీటితిప్పలలో మనకోసం మన నాయకర్



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** మొగల్తూరు మండలం కోమటి తిప్ప, నీటి తిప్ప గ్రామాల్లో నియోజకవర్గ జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొమ్మిడి నాయకర్, నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పొత్తూరి రామరాజులు సోమవారంఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో త్రాగునీటి సమస్య రోడ్లు సమస్య ఎక్కువగా ఉంది అని ఆయా గ్రామాల ప్రజలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాగంటి మురళీకృష్ణ (చిన్న) కొల్లాటి గోపీకృష్ణ, వలవల నాని, గుబ్బల నాగరాజు, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, గట్టెం శ్రీను, గుబ్బల మార్రాజు, పులపర్తి సుబ్రమణ్యం, మేడిది ప్రభాకర్, వనమాల శ్రీను, దొడ్డా బాబ్జి, ఆకుల శ్రీనివాస్, తోట నాని, పోలిశెట్టి నళిని, కంచర్ల పుష్ప, బసవాని నాగమణి, గ్రంధి నాని, సుందర రాంబాబు, సత్తినేని మోహనరావు, ఉప్పులూరి రాంబాబు, తిరుమాని ఏడుకొండలు, కందులపాటి బాలాజీ, బొడ్డు త్రిమూర్తులు, అందే దొరబాబు, మేకల కుమార్, తిరుమల రాంబాబు, రావూరి రాజు నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు,కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## సుందరయ్య మరణం పార్టీకి తీరనిలోటు



**పెదవేగి,మేజర్ న్యూస్:**మనసున్న మహారాజు ఈడ్పుగంటి సుందరయ్య అని,ఆయన మరణం అటు పార్టీకి, ఇటు వ్యక్తిగతంగా నాకు ఎన్నటికీ తీరని లోటుఅని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.ఆదివారం రాత్రి గుండె పోటుకు గురై పెదవేగి మండలం విజయిరాయి సొసైటీ మాజీ అధ్యక్షుడు, టిడిపి సీనియర్ నేత ఈడ్పుగంటి నాగభూషణం(సుందరయ్య) మరణించిన సంగతి విధితమే.మరణానికి 2గంటల ముందు సైతం చింతమనేని ప్రభాకర్ నీ కలిసి రాబోయే ఎన్నికల సమాయత్తం పై చర్చించి, చిరునవ్వులు చిందిస్తూ మాట్లాడిన సుందరయ్య అకాల మరణం పొందారు అంటూ వార్త విని ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైన చింతమనేని ప్రభాకర్. సోమవారం ఉదయం విజాయిరాయిలో జరిగిన సుందరయ్య అంతిమయాత్రలో పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు. సుందరయ్య పార్థివ దేహంపై తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి ఘన నివాళులు అర్పించిన చింతమనేని ప్రభాకర్,పుష్పాంజలి ఘటించిన ఏలూరు పార్లమెంట్ టిడిపి నేత పుట్టా మహేష్ యాదవ్ , మండల పార్టీల నాయకులు.

## కొంతేరు పెద్దపేటలో కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** ఎలమంచిలి మండలం కొంతేరు గ్రామం నందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగించారు, ఈ సందర్భంగా సమన్వయకర్త కొలుకులూరి అర్జున్ రావు మాట్లాడుతూ ప్రతి బడుగు బలహీన వర్గాల ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీపై ఎంతో మక్కువగా ఉన్నారని విశేష స్పందన వస్తుందని అన్నారు, ప్రజలకు ఎన్నికల మేనిఫెస్టో వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి రూ 5 వేల అందజేస్తారని చెప్పారు, వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైయస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రావడం కొండంత బలం చేకూరిందని, పేదల పెన్నిధి ఇందిరమ్మ ఆశయాలకు అనుగుణంగా పార్టీ పనిచేస్తుందని అర్జున్ రావు అన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరిఎలమర్తి మోహనరావు,కాంగ్రెస్ నాయకులు గంట నరసింహామూర్తి ,రత్నం, చైతన్య ,గోపాలరావు ,దొండపాటి ప్రసాద్ , తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# రబీ ధాన్యం సేకరణకు పూర్తిస్థాయిలో సన్నద్ధం

## -జిల్లా కమిటీ సమావేశంలో జాయిట్ కలక్టర్



**ఏలూరు,మేజర్‌న్యూస్** : రబీ సీజన్లో రైతులు పండించిన ధాన్యం సేకరణకు సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా జాయిట్ కలక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. సోమవారం కలక్టరేట్ లోని గౌతమీ సమావేశపు మందినరంలోని జిల్లాలోని రబీ సీజన్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రంలు నిర్వహణపై జిల్లా ధాన్యం సేకరణ కమిటీ సమావేశం జరిగింది.సమావేశములో జాయిట్ కలక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ 2023-2024రబీసిజన్‌కు సంబంధించి 120 రైతు భరోసా కేంద్రాలను ఏప్రిల్ 10వ తేదీ అనంతరం ధాన్యం సేకరణ కొరకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.జిల్లాలో రబీ రవి సీజన్లో 79వేల960 ఎకరాల్లో వరి పంట సాగు చేయబడుతుందని 3.11 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి కాగల కాగలదని అంచనా వేశారన్నారు. జిల్లాలో 22 మండలాల్లో రబీధాన్యం వస్తుందని అందులో ఎక్కువగా భీమడోలు,ఉంగుటూరు, దెందులూరు, నిడమర్రు మంజలాల నుంచి ఎక్కువ ఉత్పత్తి రాగలదన్నారు. సమావేశంలో రెవెన్యు డివిజన్ అధికారులు ఎన్ఎస్ కె ఖాజావలి, కె. అద్దయ్య, వై.భవానీ శంకరి,సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ మంజా భార్గవి,జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ఆర్ఎస్ఎస్ రాజు వ్యవసాయ శాఖా అధికారి షేక్ హబీబ్ భాషా, ఉప రవాణా కమీషనరు ఎస్. శాంత కుమారి,ఎఫ్‌సిఐ ,తూనికలు కొలతలు, డిసిఎంఎస్, సహకార, తదితర శాఖల అధికారులు ,జిల్లా రైస్ మిల్లర్స్ అసోసేషన్ అధ్యక్షులు సభ్యులు పాల్గొన్నారు.

# వయోవృద్దులు,విభిన్న ప్రతిభా వంతులకు ఇంటి వద్దనే ఓటు

## -జిల్లా ఎన్నికల అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశం



**భీమవరం,మేజర్‌న్యూస్ :** విజయవాడ రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగం, వయో వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై సోమవారం సంబంధించినఅధికారులబాధ్యతలు వారు నిర్వహించాల్సిన విధులను రాష్ట్ర సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల ఎన్నికల అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 85 సంత్సరాలు దాటిన వయో వృద్దులకు,సదరం ధ్రువీకరణ పత్రం ఆధారంగా 40 శాతం దాటినా అంగ వైకల్యం ఉన్న విభిన్న ప్రతిభా వంతులకు ఓటు వినియోగంలో అనుసరించాల్సిన నిబంధనల మేరకు వ్యవహరించి వారి ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశన్ని కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరేన్స్‌లో జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్, జిల్లా జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య,జిల్లా రెవిన్యూ అధికారి జె.ఉదయ భాస్కర రావు,జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్లు ఇవ్వకపోవడం ప్రభుత్వ కుట్ర..దేశం నేత నాయుడు



**నర్సాపురం,మేజర్‌న్యూస్:** ప్రతి నెల ఒకటవ తేదీన ఇచ్చే పెన్షన్లకు నిధులు విడుదల చేయకుండా వైసిపి ప్రభుత్వం కుట్ర చేసిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు అన్నారు. సోమవారం ఆయన సూర్య ప్రతినిధితో మాట్లాడుతూ వృద్ధులు, వెతంతులు, వికలాంగులు, తదితరుల పెన్షన్ కు సంబంధించి నిధులను రెండు రోజులు ముందుగా విడుదల చేసే వారిని ఒకటవ తారీఖున పెన్షన్లు పంపిణీ చేసేవారు అన్నారు. మార్చి 31వ తేదీ ఆదివారం వచ్చినప్పటికీ బ్యాంకులు యథావిధిగా పనిచేయని ఆయన అన్నారు.ప్రభుత్వం ద్వారా ఇచ్చే ఈ పెన్షన్తో నెల అంతా బ్రతికే వారు ఎంతోమంది ఉన్నారని ఆయన అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాలంటీర్ల ద్వారా పెన్షన్లు పంపిణీ చేసేందుకు ఎన్నికల సంఘం ఒప్పుకోనప్పటికీ ఇతర ఉద్యోగులతో పెన్షన్ అందించవచ్చునని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల 64 లక్షల మందికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెన్షన్లు అందుతున్నాయి అన్నారు. వాలంటీర్లను ఈ బాధ్యత నుండి తప్పించడంతో ప్రజలను ఇబ్బందులు పాలు చేసి వాలంటీర్లు లేకపోతే అసలు ఏమీ జరగవు అన్నట్లు మభ్య పెట్టేందుకు నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. నరసాపురంలో 15 సచివాలయాలు, మండలంలో24 సచివాలయాలు, మొగల్తూరులో 20 సచివాలయాలలో సుమారు 650 మందిఉద్యోగులు ఉన్నారని, వీరు కాకుండా పంచాయతీ సిబ్బంది కూడా వంద మంది పైన ఉన్నారని ఆయన అన్నారు. వీరందరినీ ఉపయోగించుకుంటే ఒకటవ తారీఖున పెన్షన్ ఇచ్చే వారిని, పెన్షన్ అందకపోవటానికి కారణం ప్రతిపక్షాలే అన్నట్లుగా వైసీపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు.

ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, అధికారం వారి చేతిలో ఉంటే ప్రతిపక్షాలు ఏమి చేస్తాయని అన్నారు. ప్రతి నెల యథావిధిగా జరిగే దానికి కుట్ర పూరితంగా నిధులు విడుదల చేయలేదని నాయుడు విమర్శించారు. రాజకీయంగా ప్రతిపక్షాలను ఎదుర్కోవాలి కానీ ప్రజలను ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బందితో వెంటనే పెన్షన్లు పంపిణీ చేసి ప్రజలను ఆదుకోవాలని నాయుడు కోరారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక ఆయుధం

## -జిల్లా స్వీప్ నోడల్ అధికారి ప్రభాకర్




**భీమవరం,మేజర్‌న్యూస్ :** స్థానిక ఆర్టిసి బస్టాండ్‌లో ఓటు హక్కు వినియోగం పై ఓటర్లకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్వీప్ నోడల్ అధికారి జిసిహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించు కోవడం మన బాధ్యత, ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం లాంటిదని అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు మంచి విలువ ఉందని ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా సక్రమ పద్ధతిలో ఓటును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ నిబంధనలు పాటించండి శాంతి భద్రతలను కాపాడండి పోస్టర్లను ప్రజల సందర్శనార్థం ఆవిష్కరించారు. పురవీధుల్లో ర్యాలీ మానవహారం నిర్వహించారు. కళాజాత బృందం ద్వారా ఓటు హక్కు పై బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. స్థానికులు,డ్రైవర్లు, కండక్టర్లు,పాల్గొని మేము ఓటు వేస్తాం మీరు ఓటు వేయండి చునావ్, కాపర్వ్ దేశ్ కా గర్వ్ అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రామన్,ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి, ఆర్టీసీ సిబ్బంది, మెప్మా సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలి : జిల్లా ఎస్పి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో ఉన్న ఎస్పీ ఛాంబర్‌లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గంజాయి, నాటుసారా ,మద్యం, నగదు అక్రమ రవాణా జరగకుండా ఉండేందుకు ఏలూరు జిల్లా వ్యాప్తంగా 8 చెక్ పోస్ట్ లలో ఉద్యోగ నిర్వహణ చేస్తున్న అధికారులు,సంబంధిత పోలీసు అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జిల్లాలో గంజాయి,నాటుసారా, మద్యం ,నగదు అక్రమ రవాణా అరికట్టుట,ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా అంతర రాష్ట్ర, జిల్లా ప్రాంతాలలో చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్ పోస్ట్‌ల వద్ద 24 గంటలు వాహనాల తనిఖీ చేయాలి అని,ఎన్నికల నియమావళిని అందరూ పాటిస్తూ వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించే లాగా అవగహన ప్రజలకు కల్పించాలి అని ఎస్పి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి ఇన్స్పెక్టర్‌లు మల్లేశ్వర రావు,అది ప్రసాద్,పోలవరం సబ్ డివిజన్ పరిధిలోని కుక్కునూరు,జీలుగిమిల్లి నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనటువంటి అభివృద్ధి...ముదునూరి



**మొగల్తూరు,మేజర్‌న్యూస్** : నరసాపురం నియోజకవర్గంలో మునుపు ఎన్నడు ఎవరూ చేయనటువంటి అభివృద్ధిని ఈ ఐదేళ్లలో చేసి చూపించానని మరొకసారి అవకాశం ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. సోమవారంమండలంలోని ముత్యాలపల్లి లో ఆయన ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా ప్రతి వారిని ఆప్యాయంగా పలకరిస్తూ, సంక్షేమ పథకాలు అందే తీరును అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల మహిళలు హారతులు ఇచ్చారు.మీ సోదరుడిగా, మీ స్నేహితునిగా, మీ మనవడిగామీ ఆశీర్వాదం కోసం మీ ముందుకు వచ్చా నిండు మనసుతో నన్ను ఆశీర్వదించండి. అని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, ముదునూరి శ్రీ కృష్ణంరాజుపలువురుప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు పాల్గొన్నారు.

# మంచి నీటి కాల్వలను తనిఖీ చేసిన ఆర్డిఓ

## -రెవిన్యూ, ఇరిగేషన్,ఆర్ డబ్ల్యూఎస్ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన



**కైకలూరు,మేజర్‌న్యూస్** : జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో కైకలూరు నియోజక వర్గంలోని ఇరిగేషన్ మంచినీటి కాల్వలను సోమవారం ఏలూరు ఆర్డిఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి తనిఖీ చేశారు. కైకలూరు,మండవల్లి, ముదినేపల్లి మండలాల్లోని పోలరాజ్ ఛానల్, కైకలూరు ఛానల్,కాంబెల్ ఛానల్, మోటూరు చానల్‌ను రెవెన్యూ,ఇరిగేషన్,ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు,తహశీల్దార్లుతో కలిసి పరిశీలించినట్లు ఏలూరు ఆర్డిఓ ఎన్ఎస్ కె.ఖాజావలి తెలిపారు. మంచి నీటి కాల్వల్లో ఉన్న తూడును తొలగించేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారన్నారు.కాల్వల్లో వున్న నీరు మంచినీటి అవసరాలకు వినియోగించాలే కాని ఆక్వా, వ్యవసాయానికి ఈ నీటిని వినియోగించేందుకు వీలులేదని స్పష్టం చేశారు. ఎవరైనా అక్రమ మోటార్ల ద్వారా నీటిని తోడేందుకు ప్రయత్నిస్తే ఉపోక్షించబోమని ఆర్డిఓ హెచ్చరించారు.